సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 23 । జనవరి । 2023



రామాయణం ప్రజల జీవితంలో భాగం

రామాయణం భారత ప్రజల జీవితంలో భాగమని డాక్టర్ మధురాంతకం నరేంద్ర అన్నారు. -8లో..



'ఈ-శ్రమ్' కార్డుతో భరోసా

అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత అందించేందుకు కేంద్రం 'ఈ-శ్రమ్' కారును అందుబాటులోకి తెచ్చింది. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.250
రెండోరకం	రూ.90	రూ.156



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 169 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	640	711
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 134.66 కిలోలు

సీబీఎస్‌ఈకి ఎంపికైన ప్రభుత్వ పాఠశాలలు

నియోజకవర్గం	ఎంపికైన పాఠశాలలు
మదనపల్లె	5
తంబళ్లపల్లె	10
పీలేరు	9
రాయచోటి	10
రాజంపేట	5
రైల్వేకోడూరు	5



తరగతి గదిలో విద్యార్థులు

ప్రభుత్వ బడుల్లో సీబీఎస్ఈ పాఠాలు

- జిల్లాలో 44 పాఠశాలలు ఎంపిక
- వచ్చే విద్యాసంవత్సరం 9వ తరగతి నుంచి అమలు

మదనపల్లె సిటీ: ప్రస్తుత పోటీ ప్రపంచంలో మెడిసిన్, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ తదితర కోర్సుల్లో ప్రవేశాలకు మెరుగైన ర్యాంకులు తప్పకుండా సాధించాలి. ఇందుకు జాతీయ స్థాయి విద్యా విధానం (సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) కీలకంగా మారింది. ఈ తరుణంలో నగరాలు, పట్టణాల్లోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలకే పరిమితమైన సీబీఎస్‌ఈ సిలబస్ ఇక మారుమూల ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు అందనుంది. విద్యార్థుల బంగారు భవిష్యత్ లక్ష్యంగా మరింత నాణ్యమైన, ఖరీదైన విద్య చేరువ చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు ఇప్పటికే సన్నాహాలు చేపట్టింది.

- విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం మరో సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం కొన్ని కార్పొరేట్ విద్యా సంస్థల్లో మాత్రమే అందుబాటులో ఉన్న సీబీఎస్‌ఈ సిలబస్‌ను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు 2023-24 విద్యా సంవత్సరం నుంచి ఈ ప్రక్రియను నిర్వహించేందుకు అన్నమయ్య జిల్లాలో తొలివిడతగా 44 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ మేరకు ఆయా బడుల్లో ప్రధానోపాధ్యాయులు, సహాయ ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే శిక్షణ కూడా పూర్తి చేసుకుని సిద్ధమయ్యారు. ప్రస్తుతం జాతీయస్థాయి పోటీ పరీక్షలు, ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు సీబీఎస్‌ఈ సిలబస్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంది. పదో తరగతి, ఇంటర్మీడియట్‌ను సీబీఎస్‌ఈ సిలబస్‌లో పూర్తి చేసిన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో సత్తా చాటేందుకు అవకాశాలు ఉన్నాయి. ఆరో తరగతిలో చేరితే +2 (ఇంటర్) విద్య వరకు విద్యాలయాల పర్యవేక్షణ సీబీఎస్‌ఈ బోర్డు పరిధిలో ఉంటుంది.

పది అంశాలపై నివేదిక

సీబీఎస్‌ఈను అమలు చేయనున్న పాఠశాలలకు సంబంధించి ప్రభుత్వం ముందుగా పది అంశాలపై కేంద్ర విద్యామండలికి నివేదిక అందజేసింది. పాఠశాలల గుర్తింపు, ఫైర్‌సేఫ్టీ, ధ్రువపత్రం, పాఠశాల యాజమాన్య కమిటీ, ఈపీఎఫ్ గుర్తింపు సంఖ్య, ఏకో ఫ్రెండ్లీ వాతావరణం, విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల విద్యార్హతలు, వెబ్‌సైట్ తదితర వివరాలను ఆ నివేదికలో పొందుపరిచారు. ఈ మేరకు జిల్లాలో 30 మండలాల పరిధిలో తొలివిడతగా 44 పాఠశాలలను ఎంపిక చేశారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ బోధన అమలు కానుంది. అనంతరం సాధ్యాసాధ్యాలను పరిశీలించి మిగిలిన పాఠశాలల్లో కూడా అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.



సీబీఎస్‌ఈ బోధనకు ఎంపికైన తంబళ్లపల్లెలోని కేజీబీవీ పాఠశాల

ఉపాధ్యాయులకు శిక్షణ

జిల్లాలో సీబీఎస్‌ఈకి ఎంపికైన పాఠశాలల ఉపాధ్యాయులకు దశలవారీగా శిక్షణ ఇచ్చారు. సీబీఎస్‌ఈ విధానం ఇప్పటి వరకు జిల్లాలో ఒక్క ప్రభుత్వ పాఠశాలల్లో కూడా లేదు. కార్పొరేట్ పాఠశాలల్లో తక్కువగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసేందుకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించింది. 2023-24 విద్యా సంవత్సరం నుంచి 44 ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి నుంచి సీబీఎస్‌ఈ సిలబస్ అమలు చేయనుంది.

పేద విద్యార్థులకు వరం



సీబీఎస్‌ఈ విధానం విద్యార్థులకు వరం. ఇప్పటి వరకు కార్పొరేట్, కేంద్ర ప్రభుత్వ విద్యాలయాల్లో మాత్రమే ఉన్న ఈ విధానం గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అమల్లోకి తీసుకురావడం శుభపరిణామం. కేంద్ర విద్యా మండలి నిబంధనల మేరకు అన్ని వసతులు, సౌకర్యాలు ఉన్న పాఠశాలల ఎంపిక వెబ్‌సైట్ ద్వారా జరిగింది. వచ్చే విద్యా సంవత్సరం 9 వ తరగతి నుంచి ఈ విధానం అమలు చేసేందుకు ఇప్పటి నుంచే 8వ తరగతి విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం.

-క్రిష్ణప్ప, డివైఈఓ, మదనపల్లె

మంచి నిర్ణయం



ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులకు సీబీఎస్‌ఈ సిలబస్ అవసరం. ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. పేద కుటుంబాలకు చెందిన పిల్లలు ఉన్నత విద్య అందే అవకాశం ఉంటుంది.

-పి.మహమ్మద్‌ఖాన్, టీచర్, జెడ్పీహెచ్ఎస్,మదనపల్లె.

వైభవం.. ధ్వజారోహణం



ధ్వజపూజ నిర్వహిస్తున్నఅర్చకులు

కడపరాయుడికి ప్రత్యేక పూజలు



సూర్యప్రభ వాహనంపై కడప రాయుడు

కడప కల్చరల్ : దేవతలారా రండి....కడప రాయుడు శ్రీ లక్ష్మి వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవ వైభవాన్ని తిలకించండి అంటూ వేద పండితులు సకల దేవతలను ఆహ్వానించారు. తిరుమల తొలిగడప దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో ధ్వజారోహణం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మచ్చా శేషాచార్యులు, మయూరం కృష్ణమోహన్, తివిక్రమ్, కృష్ణమూర్తి తదితరులతోపాటు వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ధ్వజపూజ నిర్వహించారు. గరుడిని చిత్రం గల పతాకాన్ని ధ్వజంపై ఎగురవేశారు.

కొడిముద్దల పంపిణీ

బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం సందర్భంగా భక్తులకు అందజేసే దీనిని గరుడుని ప్రసాదంగా కోడిముద్దలుగా పేర్కొంటారు. సంతానం లేని వారు ఈ ప్రసాదాన్ని స్వీకరిస్తే తప్పక ఫలం లభిస్తుందన్న విశ్వాసం ఈ ప్రాంత భక్తుల్లో ఉండడంతో మహిళలు విశేష సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం అలంకరించిన తిరుచ్చి వాహనంపై స్వామిని ఊరేగించారు.

- సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులను ఊయలపై ప్రతిష్టించారు. భక్తిగీతాలాపనల మధ్య స్వామికి ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా స్వామిని అలంకార మండపానికి చేర్చి అలంకరించిన చంద్రప్రభ వాహనంపై కొలువుదీర్చారు. గోవిందనామ స్మరణల మధ్య స్వామి గ్రామోత్సవానికి తరలి వెళ్లారు. తిరుమాడ వీధులలో భక్తులు తమ ఇంటి ముందుకే విచ్చేసిన స్వామికి పూజా ద్రవ్యాలు సమర్పించి మొక్కుకున్నారు. అర్చకులు వారికి మంగళ హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో గాయకులు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. అనంతరం అదే వేదికపై హరికథ నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 10.30 గంటలకు సూర్యప్రభ వాహనం, అనంతరం స్నపన తిరుమంజనం, సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల్లోగా ఊంజల సేవ, రాత్రి 7 గంటల నుంచి పెద్ద శేష వాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు.

రేపు రాజంపేటలో జాబ్‌మేళా

రాజంపేట టౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న న్యాక్ శిక్షణా కేంద్రంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించడంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బహుళజాతి కంపెనీ ప్రతినిధులు పాల్గొని విద్యార్హత, ప్రతిభను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, ఏదేని డిగ్రీ, పీజీ, నర్సింగ్ వంటికోర్సులు ఉత్తీర్ణులై 18 సంవత్సరాల పైబడి 30 సంవత్సరాలలోపు ఉన్న వారు ఇందులో పాల్గొనేందుకు అర్హులన్నారు. జిల్లాలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్వ్యూలో పాల్గొనే వారు బయోడేటా, విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు తమ వెంట తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 7093618420 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

పేరుంది..ఊరులేదు!



బుచ్చిరెడ్డిగారిపల్లె గ్రామం

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలో గుమ్మసముద్రం పంచాయతీది విచిత్రమైన పరిస్థితి. మండలంలోని 15 గ్రామపంచాయతీ కేంద్రాలకు ఊర్లున్నాయి. ఆ ఊరిపేర్ల మీదనే గ్రామపంచాయతీలు ఉన్నాయి. విచిత్రంగా గుమ్మసముద్రం పేరుతో గ్రామ పంచాయతీ ఉన్నప్పటికి ఆ ఊరు కనిపించదు. రికార్డుల్లో మాత్రమే ఊరు పేరు ఉంటుంది. బి.కొత్తకోట-మదనపల్లె రహదారిలో బుచ్చిరెడ్డిగారిపల్లెకు వెళ్లేదారిలో శతాబ్దం క్రితం గుమ్మసముద్రం గ్రామం ఉండేదని గ్రామస్తులు చెబుతారు. కాలగమనంలో గ్రామం కనుమరుగైంది. అయితే ఈ ప్రాంతంలో ఇప్పటికి నిర్మాణాల ఆనవాళ్లు కనిపిస్తాయి. ఊరున్న ప్రాంతం ప్రస్తుతం వ్యవసాయ భూమిగా మారింది. ఆ పేరుతోనే పంచాయతీ, రెవెన్యూ, ఇతర శాఖల కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. గుమ్మసముద్రం గ్రామం శిథిలమైపోయాక దీనికి సమీపంలోనే బుచ్చిరెడ్డిగారిపల్లె గ్రామం నిర్మితమైంది. గుమ్మసముద్రం గ్రామం ఉన్న ప్రాంతం మీదుగానే బుచ్చిరెడ్డిగారిపల్లెకు రహదారి ఏర్పాటైంది.

వైఎస్సార్ జిల్లాలో చిరుత సంచారం

వేముల (వైఎస్సార్ జిల్లా): మండలంలోని మీది పెంట్లకోట గ్రామ సమీపంలో ఉన్న అడ్డగుట్ట ప్రాంతంలో ఆదివారం రాత్రి చిరుత కనిపించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఆదివారం రాత్రి గిడ్డింగివారి పల్లె గ్రామం నుంచి మీదిపెంట్లకోట మీదుగా పులివెందులకు చెందిన కొందరు కారులో వెళుతుండగా అడ్డగుట్ట ప్రాంతం రాగానే చిరుత అడ్డు వచ్చింది. ఈ విషయాన్ని కారులో వెళుతున్న వారు గ్రామంలోని వాటర్ ప్లాంట్ వద్ద గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. మీదిపెట్ల కోట భూమయ్యగారిపల్లి, రాచకుంటపల్లి గ్రామాల్లో చిరుత పులి కనిపించిన విషయాన్ని మైకు ద్వారా ప్రచారం చేసి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అడ్డగుట్ట ప్రాంతంలోని తోటల వద్దకు రాత్రి వేళల్లో ఎవరూ వెళ్లవద్దన్నారు. తోటల వద్ద ఉన్న వారు ఇంటికి చేరుకోవాలని ప్రచారం చేశారు.

గంగమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన

లక్కిరెడ్డిపల్లె : ఫిబ్రవరి 21, 22న జరిగే గంగమ్మ జాతరకు సంబంధించిన ఏర్పాట్లను లక్కిరెడ్డిపల్లె సీఐ వరప్రసాద్, ఎస్ఐ వినోద్ కుమార్‌లు ఆలయ ఈఓ రవీంద్రరాజు, ఆలయ చైర్మన్ నరసింహారెడ్డితో కలిసి పరిశీలించారు. అంతకుముందు వీరి సమక్షంలో పార్వేట అమావాస్య ముగియడంతో చెల్లు వంశీయులకు ఉన్న అర్చకత్వ బాధ్యతలను ఆదివారం ఆదిమూలం చిన్నప్ప వంశీయులకు అప్పగించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మొక్కులు తీరిన వారు బోనాలు, తలనీలాలు సమర్పించారు. క్యూలైన్‌లో దర్శన ఏర్పాట్లు చేశారు. గంగరాజు, డీఎల్‌డీఓ వెంకటసుబ్బయ్య, ఏఎస్ బాలసుబ్రమణ్యం, ఎన్.శివశంకర్ రెడ్డి, హెచ్.శ్రీనివాసులు, టి.రవీంద్ర, ఆరె శివయ్య, గురుస్వామి, వెంకటేష్, ఎ.రామచంద్రయ్య, చుక్కా ప్రసాద్, ఆదిమూలం వేమయ్య, ఎ.రెడ్డి శేఖర్, కొండయ్య, సభాపతి నాయుడు, గంగరాజు, రామమోహన్, నాగేంద్ర పాల్గొన్నారు.



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్, ఆలయ ఈఓ, పోలీసులు

వారంలోగా ఇళ్ల నిర్మాణంలో పురోగతి కనిపించాలి



జగనన్న కాలనీలో ద్విచక్రవాహనంపై తిరుగుతున్న కలెక్టర్ గిరీషా పిఎస్



కాలనీ ఇళ్ల నిర్మాణం పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

- స్టేజ్ అప్‌డేషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టండి
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి అర్బన్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లపథకంలో భాగంగా నారాయణరెడ్డి పల్లె జగనన్న కాలనీలో లేఔట్‌లో వచ్చే వారంలోగా ఇళ్లనిర్మాణంలో పురోగతి కనిపించాలని అధికారులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. ఆదివారం రాయచోటి అర్బన్ పరిధిలోని నారాయణరెడ్డిపల్లె జగనన్న కాలనీ లేఔట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణం పనులను జిల్లా కలెక్టర్ స్వయంగా ద్విచక్రవాహనంపై వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులకు తగిన సలహాలు,సూచనలు ఇచ్చారు. ఎన్నిబస్తాల సిమెంట్ నిల్వ ఉంది..ఇంకా ఎంత కావాలి.. ఎంత సిమెంటు ఇండెంట్ పెట్టారు వంటి వివరాలను ఆయన హౌసింగ్ పీడీని అడిగి తెలుసుకున్నారు. కాలనీ లేఔట్‌లో మొత్తం 6420 ఇళ్లు మంజూరు కాగా వాటిలో బిలో బేస్‌మెంట్ లెవెల్ (బీబీఎల్) దశలో 1864 ఇళ్లు, బేస్‌మెంట్ లెవెల్ (బీఎల్) 3175, రూఫ్ లెవెల్ (ఆర్ఎల్) 260, ఆర్‌సి 473 , ఇంకా మిగిలిన దశలలో ఉన్న ఇళ్లనిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలంటూ అధికారులను ఆదేశించారు. బిల్లుల మంజూరు విషయంలో నిర్లక్ష్యంవహిస్తే చర్యలు తప్పవని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను కలెక్టర్ హెచ్చరించారు. ఆర్ఎల్ స్టేజిలో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తిచేయించాలన్నారు. ఫైనల్ స్టేజిలో 150 ఇళ్లు ఉన్నాయని, వాటి పూర్తి కోసం మెప్మా అధికారులు లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణం ఇపించాలన్నారు.ప్రతిశనివారం నారాయణరెడ్డిపల్లె జగనన్న కాలనీ లేఔట్‌ను సందర్శిస్తానని, పనులలో పురోగతి కనిపించక పోతే మాత్రం వేటు తప్పదంటూ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాంబాబు, హౌసింగ్ పీడీ శివయ్య, మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్ష ప్రశాంతం



రాజంపేట ఏఐటీఎస్ నుంచి పరీక్షరాసి బయటికి వస్తున్న అభ్యర్థులు



మదనపల్లెలోని పరీక్షా కేంద్రం వద్ద జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

12140 మంది హాజరు

రాయచోటి/రాజంపేట: అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించిన ప్రాథమిక పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షను నిర్వహించారు. అన్నమయ్య జిల్లా పరిధిలో మదనపల్లె, రాజంపేటలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు 13,684 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో ఆదివారం 12140 మంది పరీక్షకు హాజరయ్యారు. మదనపల్లె పట్టణ పరిధిలో 20, రాజంపేట పరిధిలో 10 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు మదనపల్లెలో, అడిషనల్ ఎస్పీ రాజ్ కుమల్ రాజంపేటలో పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచే పరీక్షా కేంద్రాలలోకి అనుమతించారు. కేవలం హాల్ టికెట్, పెన్ను మాత్రమే పరీక్షకు అభ్యర్థులకు అధికారులు అనుమతిచ్చారు.



రాజంపేట: అభ్యర్థులను తనిఖీ చేసి పంపిస్తున్న తీరును పర్యవేక్షిస్తున్న డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి

పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తుతోపాటు అన్ని ఏర్పాట్లు చేశారు. మదనపల్లె, రాజంపేటలలో కేంద్రాల వద్ద అభ్యర్థులు కిక్కిరిసిపోయారు. రీజనల్ కో-ఆర్డినేటర్ల పర్యవేక్షణలో సీలు వేసిన ప్రశ్నపత్రాల బాక్సులను ప్రత్యేకంగా కేటాయించిన బస్సుల్లో ఆయా పరీక్షా కేంద్రాలకు పంపారు. రెండు ప్రాంతాల్లో ఉన్న మొత్తం 30 పరీక్షా కేంద్రాలను రూట్లుగా విభజించారు. ఒక్కో రూటుకు మొబైల్‌పార్టీతోపాటు సీఐల నేతృత్వంలో ఎస్కార్ట్ వాహనాల్లో ప్రశ్నా పత్రాలు తరలించారు. ప్రశాంతంగా పరీక్షల నిర్వహణ పట్ల జిల్లా ఎస్పీ సిబ్బందిని అభినందించారు.

- పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో పది సెంటర్లలో పరీక్షలు జరిగాయి. డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, సీఐలు పుల్లయ్య, నరసింహారావు నేతృత్వంలో సబ్‌డివిజన్‌లోని పలువురు ఎస్ఐలు బందోబస్తును నిర్వహించారు. రాజంపేట ఏఐటీఎస్, ప్రభుత్వపాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభ్యర్థులతో ఆయా ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి.మొత్తం 4735 అభ్యర్థులకు గాను 4053 మంది హాజరయ్యారు. . రాజంపేటలోని పలు సెంటర్లలోని కొందరు అభ్యర్థులు నిమిషం ఆలస్యం కావడంతో వెను తిరగాల్సి వచ్చింది. పరీక్షలకు తమ సంస్థను ఎంపిక చేసినందుకు ఆనందంగా ఉందని ఏఐటీఎస్ అధినేత చొప్పాగంగిరెడ్డి, వైస్‌చైర్మన్ చొప్పాఎల్లారెడ్డి, ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డి అన్నారు. పరీక్షలు ప్రశాంతంగా పూర్తికావడానికి కృషిచేసిన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ మారుతి, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రంగనాథన్‌లను అభినందించారు.

వీఆర్ఓల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

రాయచోటి అర్బన్: అన్నమయ్య జిల్లా గ్రామరెవెన్యూ అధికారుల (వీఆర్ఓ) సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటైంది. పట్టణంలోని రాజుస్కూల్ ఆవరణలో జిల్లాలోని అన్ని మండలాల వీఆర్ఓలు సమావేశమయ్యారు.ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడిగా జి.రమేష్, గౌరవ అధ్యక్షుడిగా పి.లక్ష్మినారాయణ, సహ అధ్యక్షుడిగా బి.సుధాకర్‌లను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సురేష్‌రెడ్డి, పెంచలయ్య,చిన్నప్ప, నవీన్‌కుమార్, సమీరాఖానంలు, జనరల్ సెక్రటరీగా శివయ్య, సహాయ కార్యదర్శులు సదాశివప్ప, మల్లికార్జున, ఆంజనేయులు, తులసి శేఖరరెడ్డి, నీలిమలు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సోమశేఖరరెడ్డి, నాగప్రసాద్‌రావు, ఎ.వి.నాగరాజు, నరసింహులు, కోశాధికారి ఎం.భాస్కర్, ప్రచారకార్యదర్శిగా ఎం.పెంచలయ్య, మరో 5 మందిని ఈసీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్ష, గౌరవ అధ్యక్షులు రమేష్, లక్ష్మినారాయణలు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లాలోని పలుమండలాల వీఆర్ఓలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శాస్త్రోక్తంగా నిత్యపూజస్వామి ఆలయ శుద్ధి


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సిద్దవటం: మండలం లోని వంతాటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న లంకమల అడవుల్లో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి ఆలయంలో ఆదివారం పూజలు నిర్వహించారు. అర్చకుడు సుబ్రమణ్యం శర్మ మాట్లాడుతూ ఆలయం ఆవరణలో ఇటీవల చెన్నూరు మడలం చిన్నమాచుపల్లె గ్రామానికి చెందిన కోడూరు చలపతి అనే వ్యక్తి అత్మహత్య చేసుకున్నాడన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలయంలో శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. స్వామి వారికి అభిషేకం, గణపతిపూజ, పుణ్యాహవచనం జరిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొండారెడ్డి, దేవదాయ శాఖ ఉద్యోగి చంద్ర, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఏటీఎం కేంద్రంలో పాము హల్‌చల్



ములకలచెరువు : మండలంలోని బురకాయల కోట ఇండియన్‌బ్యాంకు ఏటీఎం కేంద్రంలో ఆదివారం ఒక పాము హల్‌చల్ చేసింది. కేంద్రంలోకి వెళ్లిన పలువురు వినియోగదారులు పామును చూసి హడలెత్తిపోయారు. నీళ్ల పాము కావడంతో ఏటీఎం పక్కనే నివాసం ఉంటున్న ఒక వ్యక్తి కట్టె సాయంతో చంపేశాడు. ఏటీఎం కేంద్రం ఎదురుగా పచ్చచెరువు ఉండడంతో.. అక్కడి నుంచి పాము వచ్చి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

బి.కొత్తకోట : మండలంలోని గండువారిపల్లెకు చెందిన 15 ఏళ్ల బాలిక ఆత్మహత్యకు ప్రయతి ్నంచిన ఘటనపై విచారణ చేస్తున్నామని పోలీసులు ఆదివారం తెలిపారు. బాలిక శనివారం క్రిమి సంహారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబీకులు స్థానిక సీహెచ్‌సీకి తరలించగా.. మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి 108లో తీసుకెళ్లారు. అపస్మారక స్థితిలో ఉందని, ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

'ఈ-శ్రమ్' కార్డుతో భరోసా

- కార్మికుల కోసం ప్రత్యేక వెబ్ పోర్టల్
- వివరాలు నమోదు చేసుకోవాలంటున్న అధికారులు
- ఎన్నో ప్రయోజనాలు

కడప కోటిరెడ్డి సర్కిల్ : అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రతతోపాటు వివిధ సంక్షేమ పథకాలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఈ - శ్రమ్' వెబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. కార్మికులు ఆన్‌లైన్ పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలి. వారికి గుర్తింపు కార్డు మంజూరవుతుంది. తద్వారా వారు పలు రకాల ప్రయోజనాలు పొందేందుకు వీలు ఉంటుంది. వైఎస్సార్ జిల్లాలో 3,61,734 మంది కార్మికులు నమోదు చేసుకున్నారని కార్మిక శాఖ ఇన్‌చార్జి ఉప కమిషనర్ శ్రీకాంత్‌నాయక్ తెలిపారు. నమోదు చేసుకోని వారు సత్వరమే ఆయా కేంద్రాలకు వెళ్లి తమ వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

అర్హులు వీరే

16 నుంచి 59 ఏళ్ల వయసు కలిగి ఈఎస్ఐ, ఈపీఎఫ్‌నకు అవకాశం లేని వారికి, భవన నిర్మాణ, వలస, రిక్షా, చర్మశుద్ధి కార్మికులు, చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, మత్స్యకారులు, పశు పోషణలో నిమగ్నమైన వారు, బీడీ, రోలింగ్, తోలు, ఉప్పు, ఇటుక బట్టీలు, రాతి క్వారీలో పని చేస్తున్న కార్మికులు, వడ్రంగి, క్షురకులు, కూరగాయలు, పండ్ల విక్రేతలు, వార్తా పత్రికల విక్రేతలు, ఆటో డ్రైవర్లు, వీధి వర్తకులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు అర్హులు.

నమోదు ఇలా

ఈ-శ్రమ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే వారు ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదు. కార్మికుని ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నంబరు, బ్యాంకు ఆధార్ కార్డు లింకేజీ కలిగిన ఫోన్ నంబరు ఉండాలి. సమీపంలోని సీఎస్‌సీ సెంటర్లకు లేదా పోస్టాఫీసు లేదా గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు చేస్తారు. కార్మిక శాఖ కార్యాలయాల్లో లేబర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసి సహాయ సహకారాలు అందిస్తున్నారు.

ప్రయోజనాలు

అసంఘటిత రంగ కార్మికులు సామాజిక భద్రతా చట్టం కింద సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందుతారు. వృత్తి, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు అందించేందుకు ప్రభుత్వానికి వీలు ఉంటుంది.

ప్రమాద బీమ సౌకర్యం

ఈ శ్రమ్ కార్డు పొందిన ప్రతి కార్మికుడికి ఏడాది పాటు ప్రధానమంత్రి సురక్ష యోజనలో భాగంగా.. రూ. 2 లక్షల ప్రమాద బీమా సౌకర్యం, పాక్షికంగా అంగవైకల్యం పొందితే రూ.లక్ష బీమా వర్తిస్తుంది.

వైఎస్సార్ జిల్లాలో నమోదు చేసుకున్న కార్మికులు

రంగం	సంఖ్య
వ్యవసాయం	2,14,586
నిర్మాణ	32,772
దుస్తుల దుకాణం	29,956
ఆటోమొబైల్	16,241
రవాణా	10,912
హస్తకళలు, ఎర్రతివాచీలు	10,902
ఎలక్ట్రానిక్స్	6309
హెల్త్‌కేర్	5396
ఎడ్యుకేషన్	3276
ఇతర రంగాల కార్మికులు	5720
డొమెస్టిక్ హౌస్ హోల్డర్లు	4629
మొత్తం	3,61,734


పూడికతీత పనులు చేస్తున్న అసంఘటిత రంగ కార్మికులు

కారు, బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

మదనపల్లె : కారు, బైక్ ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన సంఘటన ఆదివారం వాల్మీకిపురం మండలంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంకొండ మండలం మర్రిపాడు పంచాయతీ నక్కబండ గ్రామానికి చెందిన ప్రమీల (40), స్థానికుడు రమణ ద్విచక్రవాహనంలో వస్తుండగా వాల్మీకిపురం-మేడికుర్తి రోడ్డులోని మర్రిపాడు క్రాస్ రోడ్డులో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రమీల తీవ్రంగా, రమణ స్వల్పంగా గాయపడ్డారు. బాధితులను స్థానికులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమీల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

ఎమ్మెల్యేపై అసభ్యకర పోస్టు పెట్టిన వారిపై ఫిర్యాదు

గోపవరం : బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధపై వాట్సాప్‌లో అసభ్యకర పోస్టు పెట్టిన వారిపై కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సి.నారాయణ, ప్రజా సంఘాల నాయకుడు ఎం.రవి ఆదివారం బద్వేలు రూరల్ సీఐ హనుమంతనాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నెల 20వ తేదీ శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధ అట్లూరు మండలం తంబళ్లగొందిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి 21వ తేదీ శనివారం అట్లూరు మండల ప్రజాసేవ గ్రూపులో పెద్దుళ్ళపల్లెనరసింహ అనే వ్యక్తి పేరు మీద 9000859115 సెల్ నెంబర్ ద్వారా వాట్సాప్‌లో అసభ్యకర పోస్టు పెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆనాటి జ్ఞాపకాలు ఎప్పటికీ మధుర స్మృతులే

- ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- పాఠశాల అభివృద్ధికి కృషి
- సాక్షి ఫైనాన్స్ డైరెక్టర్ వై.ఈశ్వరప్రసాద్‌రెడ్డి


పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఎర్రగుంట్ల : ఆనాటి జ్ఞాపకాలు ఎప్పటికీ మధుర స్మృతులేనని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఎర్రగుంట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1972–73 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల స్వర్ణోత్సవ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆ బ్యాచ్ విద్యార్థి, సాక్షి ఫైనాన్స్ డైరెక్టర్ యర్రంరెడ్డి ఈశ్వరప్రసాద్‌రెడ్డి సారథ్యంలో కార్యక్రమం జరిగింది. ఆనాడు తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను పిలిపించి ఘనంగా సన్మానించారు. ముందుగా పాఠశాలలో ఉన్న శ్రీ సరస్వతి, వివేకానందుడు, యోగివేమన, డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత పూర్వ విద్యార్థులు ఒక్కొక్కరు.. వారి విద్యార్థి దశను గుర్తు చేసుకుంటూ.. ప్రస్తుతం వారి కుటుంబ స్థితిగతులను తెలియజేస్తూ ప్రసంగించారు. ఈ సందర్భంగా సాక్షి ఫైనాన్స్ డైరెక్టర్ యర్రంరెడ్డి ఈశ్వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సుమారు 50 ఏళ్ల తర్వాత కలుసుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. అప్పుడు రెండు సెక్షన్లకు గాను 80 మంది దాకా ఉండే వారని, వారిలో సుమారు 15 మంది దివంగతులయ్యారని పేర్కొన్నారు. ఉన్న వారందరూ కలుసుకోవడం శుభ పరిణామమని తెలిపారు. అప్పుడు ఉపాధ్యాయులు బోధించిన పాఠాలు వల్లనే తాము ఈ స్థాయిలో ఉన్నామన్నారు. తెలుగు మీడియంలో చదివినా ఇంగ్లిష్‌లో మంచి పట్టు సాధించామన్నారు. ఈ పాఠశాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు తమ బ్యాచ్ తరఫున కృషి చేస్తామన్నారు. అనంతరం తమకు బోధించిన ఉపాధ్యాయులైన రామమునిరెడ్డి, ఓబుళరెడ్డి, వీరారెడ్డి, నారాయణరెడ్డి, ఈశ్వరరెడ్డి, చెన్నకేశవరెడ్డిలకు దుశ్శాలువా, పూలమాల, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ 50 ఏళ్ల కిందట బోధించిన తమను గుర్తు పెట్టుకుని పిలిపించి సత్కరించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. పాఠశాలలో కల్పించాల్సిన వసతులపై సాక్షి ఫైనాన్స్ డైరెక్టర్ వై.ఈశ్వరప్రసాద్‌రెడ్డికి ఇన్‌చార్జి హెచ్‌ఎం తులసీ ఈశ్వరయ్య వినతి పత్రం అందించారు.

విద్యార్థికి పారితోషికం రూ.10116

ఈ పాఠశాలలో పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచి విద్యార్థులకు యర్రంరెడ్డి ఈశ్వరప్రసాద్‌రెడ్డి రూ.10,116 పారితోషకం అందిస్తుంటారు. అందులో భాగంగానే 2021–22 సంవత్సరానికి గాను విద్యావతి 562 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఈ విద్యార్థి విద్యావతికి తల్లిదండ్రుల సమక్షంలో రూ.10116ను ఈశ్వరప్రసాద్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఆనాటి ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయుడు ప్రభుకుమార్ పాల్గొన్నారు.


విద్యార్థికి పారితోషకం అందజేస్తున్న సాక్షి ఫైనాన్స్ డైరెక్టర్ వై.ఈశ్వరప్రసాద్‌రెడ్డి

విద్యార్థులపై అశ్రద్ధ చూపితే చర్యలు

వాల్మీకిపురం : విద్యార్థులపై అశ్రద్ధ చూపితే చర్యలు తీసుకుంటామని గురుకుల పాఠశాల జిల్లా సమన్వయ అధికారి (డీసీవో) వెంకటరావు అన్నారు. ఆదివారం స్థానిక గురుకుల పాఠశాలను ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బందిని విడివిడిగా విచారణ చేశారు. పాఠశాలలోని తొమ్మిదవ తరగతి విద్యార్థిని శనివారం ప్రసవించిన నేపథ్యంలో.. అధికారులు ఆదివారం విచారణ చేపట్టారు. విజయవాడకు చెందిన హెల్త్ మానిటరింగ్ అధికారి డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ పాఠశాల సిబ్బంది, వైద్య సిబ్బంది సైతం అమ్మాయిని బాలిక అనే కోణంలోనే చూశారని, నిత్యం తోటి పిల్లలతో ఆడుకోవడంతోపాటు విద్యార్థిని ఆరోగ్యంగా ఉండటంతో సకాలంలో గుర్తించలేకపోయారన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏ చిన్న సమస్య ఉన్నా పాఠశాల యాజమాన్యంతోపాటు సిబ్బందికి, తల్లిదండ్రులకు తక్షణమే తెలియజేయాలని సూచించారు. తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న తల్లీబిడ్డను తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలియజేశారు.


పాఠశాలలో విచారణ చేస్తున్న డీసీవో వెంకటరావు, హెల్త్ మానిటరింగ్ అధికారి డాక్టర్ రాజేష్

పోలీసుల అదుపులో అనుమానితుడు

మైనర్ బాలిక గర్భిణి కావడానికి కారకుడైన వ్యక్తిని పోలీసు ఉన్నతాధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలిక తల్లిదండ్రులు నిరుపేదలు. వారు బతుకుదెరువు కోసం దూరప్రాంతంలో నివాసం ఉన్నారు. బాలిక అవ్వాతాత సోమలలో ఉండటంతో.. దగ్గరలోని వాల్మీకిపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చేర్పించారు. దీంతో సెలవులు వచ్చినప్పుడల్లా విద్యార్థిని అవ్వాతాత నివాసం ఉన్న సోమలకు వెళ్తుంటుంది. ఇక్కడే కాపురం ఉంటూ వరుసకు మేనమామ అయిన వ్యక్తి (52) బాలికకు మాయమాటలు చెప్పి ఈ దారుణానికి పాల్పడి ఉంటాడని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి స్టేట్‌మెంట్ ఆధారంగా నిందితుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌లను తొలగించేందుకు కుట్ర


సంఘీభావం ప్రకటిస్తున్న దళిత, గిరిజన పోరాట కమిటీ నేతలు

రాయచోటి అర్బన్ : ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌లను తొలగించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని పలు సంఘాల నాయకులు ఆరోపించారు. స్థానిక ఎన్‌జీఓ సభా భవనంలో ఆదివారం దళిత హక్కుల పోరాట సమితి, గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు మండెం సుధీర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, గిరిజన సమాఖ్య నేత విశ్వనాథనాయక్, ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ బి.కె.మనోహర్, ఎంఎస్‌పీ నేత రామాంజనేయులు, ఏపీసీఎల్‌సీ నేత రెడ్డెయ్య, భానాస నేత తాతయ్య, జనసేన మహిళా నాయకురాలు రెడ్డిరాణి, బంజారా సంఘం నేత శంకర్‌నాయక్ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టంను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ రాయచోటి కార్యదర్శి సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, కాంగ్రెస్ నేత చెన్నక్రిష్ణ, మహిళ సమైఖ్య నాయకురాలు సుమిత్ర, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, దళిత మిత్ర జిల్లా అధ్యక్షుడు కిషోర్, ఏపీ ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురేష్, వినోద్‌నాయక్, శివాజీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా దళిత, గిరిజన పోరాట కమిటీ ఎన్నిక

సమావేశం అనంతరం జిల్లా దళిత, గిరిజన పోరాట కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా మండెం సుధీర్ కుమార్, ఆర్గనైజింగ్ కన్వీనర్‌లుగా కృష్ణప్ప, మనోహర్, గౌరవ అధ్యక్షులుగా మూడే శంకర్‌నాయక్, రామాంజనేయులు, గౌరవ సలహాదారులుగా అడ్వకేట్ రెడ్డెయ్య, పల్లం తాతయ్య, కో-కన్వీనర్‌గా విశ్వనాథనాయక్, యుగంధర్, సురేష్‌మాదిగ, నాగేశ్వర, వీరయ్య, శ్రీనివాసులు, నాగన్న, వెంకటాద్రి, హరి, పందరయ్య ఎన్నికయ్యారు.

కల్వర్టును ఢీకొన్న బస్సు

- 8 మందికి గాయాలు
- డ్రైవరు లోబీపీతో ప్రమాదం

కలకడ : ఆర్టీసీ బస్సు అదుపు తప్పి కల్వర్టును ఢీకొనడంతో 8 మంది గాయపడ్డ సంఘటన ఆదివారం జిల్లాలోని చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై కలకడ సమీపంలో జరిగింది. ఎస్ఐ సీటీ స్వామి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాయచోటి డిపోకు చెందిన బస్సు తిరుపతి నుంచి ప్రయాణికులతో రాయచోటికి వస్తోంది. కలకడ మండలం కె.బాటవారిపల్లె పంచాయతీ పోతువారిపల్లె వద్ద బస్సు డ్రైవర్ కలికిరికి చెందిన అంకన్నకు బీపీ తగ్గడంతో కళ్లుమూసుకుపోయి కల్వర్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తోపాటు కండక్టర్ సుబ్బరాయుడు, ఆరుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఆరుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. బాధితులను 108 అంబులెన్స్‌లో పీలేరు, రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. పీలేరులో చికిత్స పొందుతున్న వారిని పీలేరు ఆర్టీసీ డిపో డీఎం ధనుంజయ పరామర్శించారు. అవసరమైన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన వైద్యులను కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


రోడ్డు పక్కన కల్వర్టును ఢీకొన్న బస్సు

రామాయణం ప్రజల జీవితంలో భాగం

- ఆచార్య మధురాంతకం నరేంద్ర

కడప సెవెన్‌రోడ్స్ : రామాయణం భారత ప్రజల జీవితంలో భాగమని కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డాక్టర్ మధరాంతకం నరేంద్ర అన్నారు. డాక్టర్ వేమిరెడ్డి సులోచనాదేవి రచించిన 'ఎ కంపెండియం ఆఫ్ నేమ్స్ ఇన్ ది వాల్మీకి రామాయణ' పుస్తకావిష్కరణ సభ ఆదివారం నగరంలోని ఐఎంఏ హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నరేంద్ర మాట్లాడుతూ రామాయణం అన్ని విషయాలను చెబుతుందని, మనుషులు ఎలా జీవించాలో సూచిస్తుందన్నారు. గ్రంథ సమీక్షకులు, సిలికాంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అద్దంకి శ్రీనివాస్ మాట్లాడుతూ రామాయణంలోని పాత్రలు, నదులు, నగరాలు, ముఖ్య సంఘటనలను సులోచనదేవి తన గ్రంథంలో వివరించడం అభినందనీయమన్నారు. వాల్మీకి రామాయణమే ప్రామాణికమని, దాని ఆధారంగా సులోచనదేవి పుస్తకాన్ని వెలువరించారన్నారు. అన్నపూర్ణ నిత్యాన్నదాన క్షేత్రం అధ్యక్షులు గండ్లూరు నారాయణరావు మాట్లాడుతూ రామాయణాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన రిటైర్డ్ ఇంజనీరు పుత్తా పుల్లారెడ్డి మాట్లాడుతూ తాను గతంలో రాసిన ఆంధ్ర మహాభారత నామ సర్వస్వాన్ని మొట్టమొదట అంగీకరించడంతో.. డాక్టర్ సులోచనదేవి నామ నింఘటువు రచనకు నడుం బిగించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ పుత్తా బాలిరెడ్డి, పలువురు వైద్యులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.


'ఎ కంపెండియం ఆఫ్ నేమ్స్ ఇన్ ది వాల్మీకి రామాయణ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

అమ్మవారిశాలలో సీసీ కెమెరాలు చోరీ

ముద్దనూరు: స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయాని అమర్చిన రెండు సీసీ కెమెరాలు చోరీకి గురయ్యాయి. సంఘటన దృశ్యాలు మరో సీసీ కెమెరాలో కనిపించాయి.ఆలయ నిర్వాహకుల సమాచారం మేరకు శనివారం రాత్రి అమ్మవారిశాల వెనుక వైపు గోడకు రెండు సీసీ కెమెరాలు, దానికి ఎదురుగా ఫంక్షన్ హాలుకు కెమెరాలు ఉన్నాయి.అయితే అమ్మవారిశాల కెమెరాలు చోరీకి పాల్పడిన వ్యక్తి తనను గుర్తు పట్టడానికి వీలు లేకుండా పోలీసులకు ఎటువంటి ఆనవాళ్లు లభించకుండా జాగ్రత వహించాడు. కళ్లద్దాలు,ముఖానికి మాస్క్ ధరించి చోరీకి పాల్పడినట్లు సీసీ కెమెరాల్లో కనిపిస్తోంది. పోలీసులు ఆదివారం అమ్మవారిశాలను పరిశీలించారు.


చోరీకి పాల్పడుతూ సీసీ కెమెరాలో కనిపిస్తున్న నిందితుడు

చెకుముకి సంబరాల సందడి

కడప కల్చరల్: కడప నగరంలోని జయరాజ్ గార్డెన్స్‌లో ఆదివారం చెకుముకి రాష్ట్ర స్థాయి సైన్స్ సంబరాలు జరిగాయి. ఇందులో సైన్స్ ప్రయోగాలపై రాత పరీక్ష కూడా నిర్వహించారు. ఈ ప్రయోగాలను సైంటిస్టులతోపాటు సంస్థ నాయకుడు యుగంధర్ బాబు విద్యార్థులతో కూడా చేయించారు. అనంతరం సంస్థ నాయకులు కుర్రా రామారావు అధ్యక్షతన కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, సైంటిస్టు బాల మురళి, ప్రొఫెసర్ రామచంద్రయ్య, కోట వెంకటేశ్వరరావు, డాక్టర్ కాలేషా, డాక్టర్ నాగరాజు పలు ప్రయోగాల గురించి వివరించారు. రాష్ట్ర నాయకులు కుర్రా రామారావు, త్రిమూర్తులు, దేవదత్తం, సరస్వతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన వారందరికీ మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సంఘాల నాయకులు బాల గంగిరెడ్డి, లక్ష్మిరాజా, మహేష్, సంస్థ సమతా కన్వీనర్ సరస్వతి, ఇతర నాయకులు కామేశ్వరమ్మ, పద్మావతి, తెలంగాణ ప్రతినిధులు శ్రీనాథ్, శ్రీనివాసులు, జిలానీ బాషా, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్ రాహుల్, మురళీధర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. సైన్స్ ప్రయోగాలను సంస్థ ప్రతినిధులు వెంకటరమణ, గిరిధర్‌మూర్తి, శ్రవణ్ నిర్వహింపజేశారు. విజేతలైన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్